# బోన్ మ్యారో క్యాన్సర్ బాధిత బాలుడికి అండగా వాడపల్లి.. రూ.2 లక్షలకుపైగా ఆర్థిక సాయం



**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 2:** బోన్ మ్యారో క్యాన్సర్‌తో పోరాడుతున్న బాలుడి చికిత్సకు వాడపల్లి గ్రామం అండగా నిలిచింది. గ్రామానికి చెందిన ఆలపాటి ప్రకాశ్‌రావు కుమారుడు ఆలపాటి అజయ్ సత్య వరప్రసాద్ చికిత్స నిమిత్తం గ్రామస్తులు, మిత్రులు, బంధువులు, శ్రేయోభిలాషులు స్వచ్ఛందంగా విరాళాలు అందించారు. వారి నుంచి సేకరించిన రూ.2,00,459ను ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు.

వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, గ్రామ పెద్దలు, దాతల సమక్షంలో ఈ మొత్తాన్ని ఆలపాటి ప్రకాశ్‌రావు కుటుంబానికి అందించి, బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గ్రామస్థుల ఐక్యత, మానవత్వానికి ఈ సహాయం నిదర్శనంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అల్లు వెంకటేశ్వర్లు, ఏపుగంటి సత్తిపండు, ఏపుగంటి సురేష్, ఎస్. ప్రసాద్, అర్చక స్వామి సాయి, రాజా, విశ్వనాథం, చలపతి, ఏపుగంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే బండారు





**ప్రజాదర్బార్.. 18 అర్జీలు స్వీకరణ**

**రావులపాలెం పెన్ పవర్ ఆగస్టు 2:** ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా నిర్భయంగా తన దృష్టికి తీసుకురావాలని, అర్జీల రూపంలో అందిన ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రావులపాలెం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం రావులపాలెంలో టిడిపి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి 18 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందడం, వారి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభించడమే ప్రజాదర్బార్ ముఖ్య ఉద్దేశమన్నారు. చిన్నచిన్న సమస్యల విషయంలో సంబంధిత శాఖల అధికారులతో వెంటనే మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. పరిష్కారానికి కొంత సమయం పట్టే సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్న ఆయన, ప్రతి అర్జీని వ్యక్తిగతంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రెవెన్యూ, పింఛన్లు, గృహాలు, రహదారులు, తాగునీరు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలతో నేరుగా ముఖాముఖి సమావేశాలు నిర్వహించడం ద్వారా వారి సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించే విధానాన్ని కొనసాగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన ప్రతి ఒక్కరితో మాట్లాడి వారి వినతులను స్వీకరించి సంబంధిత శాఖలకు పంపించారు.

# శ్రీ సత్యదేవుని నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,101 విరాళం



**అన్నవరం, పెన్ పవర్ ఆగస్టు 2:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన దాసరి మోహన్ రెడ్డి తన కుమారుడు దాసరి లోక్ ఆర్యనాద్ పేరుమీద రూ.1,00,101 (ఒక లక్ష నూట ఒకటి) విరాళాన్ని అందజేశారు.

ఈ విరాళాన్ని దేవస్థానం కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధర్ రావుకు అందజేయగా, అక్టోబర్ 29వ తేదీన తమ కుమారుడి పేరుమీద నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించాలని దాతలు కోరారు.

విరాళాన్ని స్వీకరించిన కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధర్ రావు దాత దాసరి మోహన్ రెడ్డిని అభినందించి, శ్రీ స్వామివారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు.

అనంతరం దాసరి మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

దేవస్థానంలో నిత్య అన్నదాన పథకానికి భక్తులు పెద్ద ఎత్తున విరాళాలు అందజేస్తుండటంతో ప్రతిరోజూ వేలాది మంది భక్తులకు అన్నప్రసాదం అందించడం జరుగుతోందని దేవస్థానం అధికారులు తెలిపారు.


# ర్యాలి జగన్మోహిని కేశవస్వామికి విశేష పూజలు......



**నిత్య అన్నదానానికి భక్తుల విరాళాలు**

**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 2:** ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని వేంచేసి చేసియున్న అతి పురాతన, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో ఆదివారం విశిష్ట పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వాడపల్లి శేషాచార్యులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించగా, రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద సేవలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి భక్తులు ఉదారంగా విరాళాలు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన కలిదిండి వినయ్బాలరామరాజు--రమ్యలహరి దంపతులు రూ.10,116, తిరుపతికి చెందిన జి.వి. సదాశివుడు దంపతులు మరో రూ.10,116 విరాళంగా సమర్పించారు. విరాళాలు అందించిన దాతలను ఆలయ వేద పండితులు వెంకట అవధాని వేద ఆశీర్వచనాలతో ఆశీర్వదించగా, ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్త మండలి సభ్యులు, స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందించి ఘనంగా సత్కరించారు.




# పోలవరం ఏలేరు కాలువ అనుసంధానంతో రైతులకు పుష్కలంగా సాగునీరు.





- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ,డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు
- ఏలేరు ఆయకట్టుకు సాగునీటి విడుదల.

**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 02:** పోలవరం ఏలేరు కాలువ అనుసంధానం పూర్తయితే రైతులకు పుష్కలంగా సాగునీరు అందుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్,టిడిపి రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు అన్నారు. గోదావరి ఎడమ కాలువ ప్యాకేజీ-3 నుంచి ఏలేరు ప్రధాన కాలువకు నీటిని అనుసంధానించి కిర్లంపూడి, పెద్దాపురం, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లోని బ్రాంచ్ కాలువలకు ఆదివారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు నీటిని విడుదల చేశారు. కిర్లంపూడి మండలం కృష్ణవరం వద్ద గోదావరి తల్లికి, ఏలేరు కాలువకు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించిన అనంతరం నీటి విడుదల ప్రారంభించారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టిందని జ్యోతుల నెహ్రూ తెలిపారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా 1,400 క్యూసెక్కుల గోదావరి జలాలను ఏలేరు ప్రాజెక్టులోకి ఎత్తిపోస్తుండగా కృష్ణవరం వద్ద పోలవరం కాలువ నుంచి మరో 750 క్యూసెక్కుల నీటిని ఏలేరు ఆయకట్టు, పిఠాపురం బ్రాంచ్ కాలువకు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. దీంతో 53 వేల ఎకరాలకు సకాలంలో సాగునీరు అందడంతో వరి, ఉద్యాన పంటలకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఏలేరు పరివాహక రైతులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే నీటి సంఘాల ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించి నీటి విడుదలకు ఆదేశాలు ఇచ్చారని నెహ్రూ పేర్కొన్నారు. పోలవరం-ఏలేరు కాలువ అనుసంధానం పూర్తయితే జగ్గంపేట, పిఠాపురం ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు అందుతుందన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, వ్యవసాయమే అభివృద్ధికి వెన్నెముక అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, ఏలేరు వైస్ చైర్మన్ ఊటా నానిబాబు, ఎంపీపీ తోట రవి, వీరవరం సొసైటీ అధ్యక్షుడు, తోట గాంధీ, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ మెంబర్లు భూపాలపట్నం ప్రసాద్, చదరం చంటిబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొదిరెడ్ల సుబ్బారావు, నాయకులు కొత్త కొండబాబు, నీలం శ్రీను, అనుకుల శ్రీకాంత్, పిఠాపురం జనసేన నాయకులు జ్యోతుల శ్రీనివాసరావు, దాసరి సీతారామకృష్ణ, బొదిరెడ్ల సుబ్బారావు, పాఠంశెట్టి మురళీకృష్ణ, ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా వైసిపి మండల యూత్ ప్రెసిడెంట్ మౌళి ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలు.

**ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు,ఓఆర్ఎస్ఎల్ ప్యాకెట్లు పంపిణీ**

**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 02;** మండలంలోని జొన్నాడ గ్రామానికి చెందిన వైసీపీ మండల యూత్ ప్రెసిడెంట్ వెలగల మౌళి ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆయన ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన అభిమానుల మధ్య భారీ కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ బాణసంచా కాలుస్తూవేడుకలు నిర్వహించుకున్నారు. అనంతరం భారీ ర్యాలీగా బయలుదేరి మండల కేంద్రమైన ఆలమూరులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఓఆర్ఎస్ఎల్, బ్రెడ్డులు, పండ్లు అందజేశారు. ఈ మేరకు పలువురు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.








# అన్నవరంలో వైభవంగా శ్రీ సత్యదేవుని రథసేవ





**అన్నవరం, పెన్ పవర్ ఆగస్టు 2:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో శ్రీ సత్యదేవుని రథసేవ శనివారం నాడు అత్యంత వైభవంగా జరిగింది.

ప్రత్యేక అలంకరణలు ఆధ్యాత్మిక వాతావరణం:

దివ్య రూపాలు: ఆలయ అర్చకులు శ్రీ సత్యదేవుడు, శ్రీ అనంతలక్ష్మి అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధభరితమైన నానావిధ పుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు.

రథోత్సవం: ఉత్సవమూర్తులను శోభాయమానమైన రథవాహనంపై ఆశీనులను చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణం చుట్టూ రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

భక్తుల పారవశ్యం: రథసేవను తిలకించేందుకు కొండపైకి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ పరిసరాలన్నీ 'గోవింద... గోవింద...' నామస్మరణతో మార్మోగాయి.

కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:

ఈ వైభవంలో దేవస్థానం ఏఈఓ భాస్కర్ రావుతో పాటు అధికారులు, పాలకమండలి సభ్యులు, ప్రధాన అర్చకులు, వ్రత పురోహితులు, దేవస్థాన సిబ్బంది మరియు స్థానిక గ్రామస్థులు విశేషంగా పాల్గొన్నారు.

